

SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం



గురువారం, 13 మార్చి 2025

# సాహసాలు, పోరాటాలు, త్యాగాల ప్రతిరూపమే 'జయకేతనం'

*** జనసేన పార్టీ ఆవిర్భావ సభకు 'జయకేతనం'గా నామకరణం**
*** ఉమ్మడిగా సాధించిన 100 శాతం స్ట్రైక్ రేట్ ఉత్సవమే ఆవిర్భావ సభ**
*** ప్రవేశ ద్వారాలకు ముగ్గురు మహనీయుల పేర్లు**
*** ఇతర రాష్ట్రాల నుంచి సభకు వచ్చే వారికి ప్రత్యేక ఏర్పాట్లు**
*** ప్రత్యేకంగా రూపొందించిన సభ పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్**



**శతఘ్ని న్యూస్: ఎందరో త్యాగాలు, మరెందరో పోరాటాలు, ఇంకెందరో త్యాగాలతో జనసే**న పార్టీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన 100 శాతం స్ట్రైక్ రేట్ విజయాన్ని ఒక ఉత్సవంలా జరుపుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ గారు చెప్పారు. జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించిన మేరకు ఆవిర్భావ దినోత్సవాన్ని 'జయకేతనం' సభగా నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన పిఠాపురంలోని చిత్రాడ వేదికగా జరగబోతున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జయకేతనం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ "జనసేన పార్టీ మొదటి నుంచి జాతీయ నాయకులను, చరిత్రలో నిలిచిపోయిన గొప్ప వారిని గుర్తు పెట్టుకునేలా ఏ కార్యక్రమం అయినా రూపొందించి ముందుకు వెళుతుంది. దీనిలో భాగంగా ఆవిర్భావ దినోత్సవ సభకు శ్రీ పవన్ కళ్యాణ్ గారి సూచన మేరకు జయకేతనంగా నామకరణం చేశాం. ఎన్నో పోరాటాలు, జన సైనికులు, వీర మహిళల సాహసాలతో కూడిన 100 శాతం విజయం అందుకున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా చేసుకొనే గొప్ప వేడుకగా ఇది మిగిలిపోతుంది. ఇక సభా స్థలానికి వెళ్లే మూడు ప్రవేశ ద్వారాలకు ఈ ప్రాంతానికి ఎంతో పేరు తెచ్చిన ముగ్గురు గొప్ప వ్యక్తుల పేర్లు పెట్టుకుని వారిని గౌరవించుకుంటున్నాం. మొదటి ద్వారానికి పిఠాపురం రాజాగా ఎన్నో విద్యాలయాలకు స్థలాలు, నిధులు దానం, ఈ ప్రాంతంలో ఎంతోమందిలో అక్షర కాంతులు నింపిన పిఠాపురం రాజు శ్రీ రాజా సూర్యారావు బహుదూర్ గారి పేరును, అలాగే రెండో ప్రవేశ ద్వారానికి మరో వితరణ శీలి... విద్యా సంస్థలకు, ధార్మిక, సేవా కార్యక్రమాలకు తన సంపాదన దానం ఇచ్చిన శ్రీ మల్లాడి సత్యలింగం నాయకర్ గారి పేరును, జనసేన పార్టీ ఏ కార్యక్రమం చేసినా ప్రత్యేకంగా స్మరించుకొనే అపర అన్నపూర్ణగా పేరుగాంచిన శ్రీమతి డొక్కా సీతమ్మ గారి పేరును మూడో ద్వారానికి పెట్టాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించారు. ఈ ప్రాంత మహనీయులు, వితరణలు చేసిన వారి స్ఫూర్తిని చాటడం, వారిని గౌరవించుకోవడం, భావి తరాలకు వారి ఘనత చాటి చెప్పడమే జనసేన పార్టీ లక్ష్యం. దీనికి అనుగుణంగానే కార్యక్రమాలను రూపొందించుకుంటున్నాం.



*** తుది దశకు ఏర్పాట్లు**

సభ అద్భుతంగా జరిగేలా ఇప్పటికే పార్టీ నాయకులతో వివిధ కమిటీలను ఏర్పాటు చేసి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వారందరికీ తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. సాయంత్రం మూడు గంటల నుంచి సభ ప్రారంభమై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో మొదలవుతుంది. మన సంప్రదాయాలు ప్రతిబింబించేలా, జనసేన పార్టీ పోరాటాలు తెలిసేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాం. అలాగే పార్కింగ్ ఏర్పాట్లు, భోజన వసతి ఏర్పాట్లను పక్కాగా చేశాం. పోలీసుల సహకారం తీసుకొని సభను విజయవంతం చేసేందుకు తగిన విధంగా సన్నద్ధం అయ్యాం" అన్నారు.

*** మీడియాకు ప్రత్యేక ఏర్పాట్లు: శ్రీ పిడుగు హరిప్రసాద్, శాసన మండలిలో ప్రభుత్వ విప్**

ఈ సందర్భంగా శాసనమండలిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శ్రీ పిడుగు హరి ప్రసాద్ గారు మాట్లాడుతూ "పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి మీడియాకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. వారికి ప్రత్యేక గ్యాలరీతోపాటు వారి విధులకి అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పిస్తున్నాము. ఇంటర్నెట్ ఏర్పాట్లు, అలాగే వారికి అవసరమయ్యే కంప్యూటర్ సిస్టంలను సైతం అందుబాటులో ఉంచుతున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా మీడియా ప్రతినిధులు పని చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కమిటీని సైతం ఏర్పాటు చేశాం. ప్రత్యేక పాసులను మీడియా కమిటీ ఇవ్వనుంది. మీడియా ప్రతినిధులు కూడా తగిన విధంగా సహకరిస్తారని ఆశిస్తున్నాం " అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు శ్రీ పంతం నానాజీ, శ్రీ గిడ్డి సత్యనారాయణ, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీ తోట సుధీర్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ చిలకలపూడి పాపారావు, పార్టీ పీఏసీ సభ్యులు శ్రీ కోన తాతారావు, జనసేన నాయకులు శ్రీమతి చల్లా లక్ష్మి, శ్రీమతి ఆకేపాటి సుభాషిణి, శ్రీ వై.శ్రీనివాస్, శ్రీ ఇర్రంకి సూర్యారావు పాల్గొన్నారు.

## ఘనంగా జయకేతనం పోస్టర్ ఆవిష్కరణ

శతఘ్ని న్యూస్: పిఠాపురం, చిత్రాడ గ్రామంలో మార్చి 14 న జరగబోవు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభా ప్రాంగణంలో జనసేన పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అక్కడ ఉన్న అధికారులతో తగు జాగ్రత్తలు గురించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ మరియు "సాహసించాం... సంగ్రమించాం...సంభ్రమించే విజయాన్ని సాధించాం రండి పొంగే కెరటాల ఉత్సవం చేసుకుందాం..." అనే స్లోగన్ తో జయకేతనం పోస్టర్ ను ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు తదితరులు పాల్గొన్నారు.





శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
గురువారం, 13 మార్చి 2025






శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
గురువారం, 13 మార్చి 2025






శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
గురువారం, 13 మార్చి 2025







# జనసేన ప్రచార రథాలకు ప్రారంభం — ప్రతి గ్రామానికీ ఆహ్వానం



శతఘ్ని న్యూస్: జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకుని, ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి ఆహ్వానం వెళ్లేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టామని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు అన్నారు. బుధవారం సామర్లకోట పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద జనసేన ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ గ్రామానికి జనసేన సందేశం చేరించాలనే ఉద్దేశంతో ప్రచార రథాలను ప్రారంభించామని తెలిపారు. ప్రతి ఇంటికి ఆహ్వాన పత్రికలు పంపించామని, అలాగే ఆటోల ద్వారా ప్రచార రథాలు నడిపి మైక్ అనౌన్స్మెంట్ ద్వారా జనసేన ఆవిర్భావ దినోత్సవానికి ప్రజలను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రచార రథాలు ప్రతి గ్రామానికి చేరుకుని జనసేన సిద్ధాంతాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయనున్నాయని తుమ్మల రామస్వామి బాబు తెలిపారు.

## ఏలూరు సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం

★ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన జోనల్ చైర్మన్..



శతఘ్ని న్యూస్: ఏలూరు: ఇటీవల ఏలూరు జిల్లాలోని చొదిమెళ్ల వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం మరువకముందే మరో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజామున 4:00 గంటల సమయంలో కలపర్రు టోల్‌గేట్ సమీపంలో రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఈ ఘటన జరిగింది. లారీని తప్పించబోయే క్రమంలో ఆర్టీసీ బస్సు వెనుక నుండి ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 12 మంది ప్రయాణికులు గాయపడారు. బస్సు కాకినాడ నుండి గుంటూరు వెళ్లుతుండగా ఈ ఘటన జరిగింది. గాయపడిన వారిని వెంటనే ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద బాధితులను ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ & బోర్డు డైరెక్టర్ రెడ్డి అప్పలనాయుడు ఆసుపత్రిలో పరామర్శించారు. ఇంజినీరింగ్ కాలేజీ వద్ద జరిగిన ఈ ప్రమాదం చాలా బాధాకరమని, ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు పూర్తి సహాయం అందజేస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు డిపో అసిస్టెంట్ మేనేజర్ మురళి, స్టేషన్ మేనేజర్ కుమారి, ఏలూరు ఆర్టీసీ అధికారులు, మరియు జనసేన నాయకులు జోనల్ చైర్మన్ వెంట ఉన్నారు.




## జనసేన ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎం.ఎల్.ఎ చిర్రి బాలరాజు

శతఘ్ని న్యూస్: మార్చి 14వ తారీఖున జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించి, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన కాకినాడలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు హాజరై, వేడుకల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా శ్రమించాలని ఆయన కోరారు.సభ కోసం అవసరమైన ఏర్పాట్లు, ప్రజల రాకపోకలకు అనుకూలంగా రవాణా సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై సమావేశంలో చర్చ జరిగింది. మంత్రి నాదెండ్ల మనోహర్ గారు ఈ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించగా, అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బ్లడ్ క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం

★ఏలూరు ఆర్యవైశ్య యువజన సంఘం ముందడుగు

శతఘ్నిన్యూస్:ఏలూరు నగరంలోని హీరో షోరూమ్‌లో పనిచేస్తున్న బొత్స శ్రావణ్ కుమార్ బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉండటంతో, వైద్య ఖర్చులకు తోడ్పాటు అందించేందుకు ఏలూరు ఆర్యవైశ్య యువజన సంఘం ముందుకొచ్చింది. ఈ మేరకు రూ. 45,000/– రూపాయల ఆర్థిక సహాయాన్ని జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీ దివ్వెల జయబాబు, యువజన సంఘ నాయకుల చేతుల మీదుగా బొత్స శ్రావణ్ కుమార్ కుటుంబ సభ్యులకు ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా బొత్స శ్రావణ్ కుమార్ త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో తిరిగి సాధారణ జీవితానికి రాగలగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా గారి టీమ్, లింగమల్లు సంతోష్, బలబద్ర విశ్వనాథ్, చలువాది పవన్, కె. పవన్, చలువాది సూర్యనారాయణ, దోపగుంట్ల సత్యనారాయణ, ప్రశాంత్, గొల్ల శ్రీకాంత్, వెనవల్లి రాంప్రసాద్, పాదర్తి రవి, కంభంపాటి రామ్మోహన్ రావు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ ఉదార సహకారం బొత్స శ్రావణ్ కుమార్ కుటుంబానికి కొంత ఊరటనిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.



# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

గురువారం, 13 మార్చి 2025







SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

గురువారం, 13 మార్చి 2025




## ఆప్ సబ్ కి ఆవాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ బహుకరణ



శతఘ్ని న్యూస్: అనకాపల్లి జిల్లా, గొలుగొండ మండల తహసిల్దార్ కార్యాలయానికి ఆప్ సబ్ కి ఆవాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ శివ వడ్లమూడి ఆధ్వర్యంలో కంప్యూటర్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసు, విఆర్ఓ పడాల, ప్రెసిడెంట్ ప్రత్తి రమణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నిమ్మదాల సురేష్ రంగా, కుర్రెల చక్రవర్తి, సెక్రటరీ బావిశెట్టి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా కంప్యూటర్ బహుకరణ చేయడం పట్ల స్థానిక అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాసేవను మరింత సమర్థంగా అందించేందుకు ఈ సహాయం ఉపయోగపడుతుందని తహసిల్దార్ శ్రీనివాసు పేర్కొన్నారు.

## వైఎస్ జగన్ పెట్టిన ఫీజు బకాయిలపై వైసీపీ ఆందోళన విడ్డూరం!



శతఘ్ని న్యూస్: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పెట్టిన ఫీజు బకాయిలపై వైసీపీ చేస్తున్న ఆందోళన విడ్డూరంగా ఉందని జనసేన పార్టీ జిల్లా సీనియర్ నాయకులు & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పుల వెలమ వెల్ఫేర్ & డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డా. రవి కుమార్ మిడతాన వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థులు, యువత గురించి పట్టించుకోని జగన్ రెడ్డి గారికి ఇప్పుడు గుర్తు వచ్చిందా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రూ. 4,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన బకాయిలు మిగిల్చిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ. 800 కోట్ల రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించామని తెలిపారు. విద్యార్థులు, టీచర్ల వివరాలను వైసీపీ ప్రభుత్వం గందరగోళం చేసిందని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఉద్యోగుల బకాయిలను ప్రస్తుతం తీర్చుతున్నామని స్పష్టం చేశారు. "జగన్ పెట్టిన ఫీజు బకాయిలపై పోరాడేందుకు ఇప్పుడు వారి పార్టీయే రోడ్డెక్కడం హాస్యాస్పదం. రాష్ట్రంలోని యువత అంతా ఈ డ్రామాను గమనిస్తున్నారు," అని డా. రవి కుమార్ మిడతాన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాళిదాసు పాత్రి, రామునాయుడు, ఆదినారాయణ, గుద్దల పైడిరాజు, కోసురు అప్పన్నదొర, గణేష్ తదితరులు పాల్గొన్నారు.







## జనసేన ఆవిర్భావ సభ విజయవంతం కావాలి!

శతఘ్ని న్యూస్: మార్చి 14న పిఠాపురంలో జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను పురస్కరించుకుని బుధవారం మదనపల్లి నియోజకవర్గ జనసేన నాయకులు రామ రామాంజనేయులు ఆధ్వర్యంలో బర్మా వీధి సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభ విజయవంతం కావాలని ప్రార్థించారు. తదనంతరం విలేకరుల సమావేశంలో మదనపల్లి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, సభకు హాజరయ్యే వారికోసం బస్సులు, కార్లు, భోజన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవాళ ప్రచార రథం మదనపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సందర్శిస్తుందని చెప్పారు. ఇది 100% స్ట్రైక్ రేట్‌తో జనసేన పార్టీ సాధించే ఘన విజయం అవుతుందని, ఈ విజయాన్ని జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమాని అందరూ సంబరంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ అందించే అమూల్యమైన సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆలకించాలి అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సభను విజయవంతం చేయడంలో సహకరించాలని ఆయన కోరారు.



## జనసేన కార్యకర్త షేక్ ఆలీ కుటుంబానికి అండగా జనసేన



శతఘ్ని న్యూస్: ప్రకాశం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గంలోని రాచర్ల గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త షేక్ ఆలీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నాయకులు నాయుడు, అలిశెట్టి వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి వెంకట్రావు, షేక్ సలీం, హనుమంతుల బాల కోటేశ్వరరావు, వేషపోగు చిన్న మరియు వీరమహిళలు ఆలీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబానికి మద్దతుగా 40 రోజులకు సరిపడే ఖర్చుల కోసం ₹10,000 ఆర్థిక సహాయం అందించి, జనసేన పార్టీ ఎప్పుడూ వారి వెన్నంటుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



మాది మిడిల్ క్లాస్!
మా గుర్తు గాజు గ్లాసు!!
జనసేన పార్టీ




హలో... పెద్దాపురం...
చలో... పిఠాపురం...
మార్చి 14
జనసేన ఆవిర్భావ
దినోత్సవం
తుమ్మల రామస్వామి (బాబు)
కాకినాడ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

గురువారం, 13 మార్చి 2025





## జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చెయ్యండి!




శతఘ్ని న్యూస్: అమలాపురం రూరల్ మండలం, నల్లమిల్లి గ్రామంలో జరిగిన మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆవిర్భావ దినోత్సవ అమలాపురం నియోజకవర్గ సమన్వయకర్తలు, ఏపీ. ఎం.ఎస్.ఎం.ఈ.డి.సి చైర్మన్ మరియు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరవనీయులైన తమ్మిరెడ్డి శివ శంకర్, నెల్లూరు సిటీ అధ్యక్షులు దుగ్గిశెట్టి విజయ్ బాబు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆవిర్భావ దినోత్సవ సమాయత్తం గురించి అమలాపురం రూరల్ మండలంలోని 22 గ్రామాల నాయకులకు, వీర మహిళలకు, జనసైనికులకు దిశా నిర్దేశం చేశారు. రూరల్ మండలం నుంచి ఈ నెల 14న జరగబోయే ఆవిర్భావ దినోత్సవ సభను భారీగా విజయవంతం చేసేందుకు పెద్దఎత్తున తరలి వెళ్దామని లింగోలు పండు గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆవిర్భావ దినోత్సవ క్రౌడ్ మేనేజ్మెంట్ సభ్యులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ళ సతీష్, మున్సిపల్ ప్రతిపక్ష నేత ఏడిద శ్రీను, మాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఆవిర్భావ దినోత్సవ జిల్లా కమిటీ సభ్యులు లింగోలు పండు, ఆకులు బుజ్జి, మెడికల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు నాగ మానస, జనసేన నాయకులు ఇసుకబట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం రూరల్ మండల నాయకుల్లో పరమట చిట్టిబాబు, నల్లా వెంకటేశ్వరరావు, సత్తి శ్రీనివాస్, పాలూరి నారాయణ స్వామి, నందుల సత్తిబాబు, గంధం శ్రీనివాస్, ఎంపీటీసీలు పోలిశెట్టి చిన్ని, మోటూరి వెంకటేశ్వరరావు, సత్తి ఆదిలక్ష్మి, కోరుమిల్లి రాంబాబు, సర్పంచ్ రావూరి భాస్కర్ రావు, ఉప సర్పంచ్ వాకపల్లి వెంకటేశ్వరరావు, ఉర్రింకి బుజ్జి, వీర మహిళ కర్రి లక్ష్మీ దుర్గ, మండలంలోని వివిధ గ్రామాల ముఖ్య నాయకులు, జనసైనికులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకారం అందించిన నల్లమిల్లి గ్రామ జనసేన నాయకులు బద్రి సాయిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు నల్లా మూర్తి, గ్రామ యువనేత గోకరకొండ కుమార్ లకు జనసేన పార్టీ అమలాపురం రూరల్ మండలం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వంతెన నిర్మాణ పనులు పరిశీలన



శతఘ్ని న్యూస్: విశ్వేశ్వరాయపురం వంతెన కల్వర్ట్ నిర్మాణ పనులను గౌరవ శాసన సభ్యులు దేవ వరప్రసాద్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి త్వరలో ఈ వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ఈ వంతెన పూర్తయితే ఎప్పటి నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని, వారి కష్టాలు తీరుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## పాలకొండ మండలంలో వైసీపీ నుంచి జనసేనలో చేరికలు



★ పాలకొండ నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి వేగం
★ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో పార్టీకి ఆదరణ పెరుగుతోంది

శతఘ్ని న్యూస్: పార్వతీపురం మన్యం జిల్లా: పాలకొండ మండలం జంపరకోటకు చెందిన ఎంపీటీసీ నిమ్మక దుర్గమ్మ, నిమ్మక ప్రసాద్, ముటక చంద్రరావు, అరిక బాబూరావు తదితరులు వైసీపీ నుంచి బయటకు వచ్చి, జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఎంపీటీసీ నిమ్మక దుర్గమ్మ తెలిపారు. జనసేన శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ వారిని జనసేనలోకి ఆహ్వానించి, పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతించారు. పార్టీ విస్తరణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ జనసేన పార్టీకి చెందిన ఎంపీపీ బొమ్మాలి భాను, వైస్ ఎంపీపీ వాకుముడి అనిల్, ఎంపీటీసీ మజ్జి నవీన్, జాడ శ్రీధర్, వేణువు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో తిరుపతి సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



శతఘ్ని న్యూస్: తిరుపతి: పెరుగుతున్న జనాభా దృష్ట్యా తిరుపతిలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. టిటిడి ఆధ్వర్యంలో ఉన్న కాలేజీలు మినహా ప్రభుత్వానికి చెందిన కాలేజీలు లేవని ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. శెట్టిపల్లి భూముల సమస్యపై ప్రస్తావన..ముప్పయి ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న శెట్టిపల్లి భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు గతంలో శెట్టిపల్లి గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తుడా పరిధిలో శెట్టిపల్లి గ్రామాన్ని చేర్చాలని డిమాండ్.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ సమస్య పరిష్కారం కాకపోగా, శెట్టిపల్లి గ్రామాన్ని మున్సిపాలిటీ పరిధిలోకి కలిపారని ఆయన ఆక్షేపించారు. మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని పేర్కొంటూ, శెట్టిపల్లిని తిరిగి మున్సిపాలిటీ నుంచి తొలగించి తుడా పరిధిలో చేర్చాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ సమస్యపై ఆందోళన.. తిరుపతి నగరంలో 30 ఏళ్ల కిందట నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాతబడిపోయిందని, పెరిగిన జనాభా దృష్ట్యా కొత్త డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. పాత డ్రైనేజీ కారణంగా నగర ప్రజలు రోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నగర అభివృద్ధికి తక్షణమే నిధులు కేటాయించి కొత్త అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.




# శతఘ్ని న్యూస్

SRI TV

జనగళమే మా గళం

గురువారం, 13 మార్చి 2025




## జనసేన జెండాను ఆవిష్కరించిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

శతఘ్ని న్యూస్: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా, బుధవారం ఉదయం కూకట్పల్లి నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యాలయం (కె.పి.హెచ్.బి కాలనీ 5వ ఫేజ్) వద్ద జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జన శ్రేణులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జనసేన కార్యకర్తలకు, వీర మహిళలకు, ప్రజలకు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే మార్చి 14న పిఠాపురం చిత్రాడలో జరుగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు కూకట్పల్లి నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కొల్లేరు పేద ప్రజల సమస్యలను పరిష్కరించండి..!



శతఘ్ని న్యూస్: ఏలూరు కలెక్టరేట్‌లో బుధవారం ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లేరు పరిసర గ్రామాల సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు, ఎన్.డి.ఎ కూటమి నాయకులు, కొల్లేరు రైతులు ఏలూరు జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. వెట్రి సెల్వి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశాల మేరకు కలెక్టరేట్‌ను సందర్శించిన వారు, కొల్లేరు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో ప్రభుత్వాలు మత్యకార మరియు కుల సంఘాలకు ఇచ్చిన సొసైటీ భూములు కాంటూరులో కలిసిపోయి, జీవనాధారాన్ని కోల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపించి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా, కొల్లేరు పరిసర గ్రామాల ప్రజలు ఆధారపడిన చెరువుల తొలగింపును నిలిపివేయాలని, వారి జీవనోపాధిని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని తెలిపారు. సొసైటీ భూముల విషయంలో బాధితులకు తగిన న్యాయం చేయాలని, వారి జీవనాధారాన్ని రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారిని కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లేరు పరిసర గ్రామాల సర్పంచ్లు, రైతులు, మరియు ఎన్.డి.ఎ కూటమి నాయకులు పాల్గొన్నారు.






## జనసేన ఆవిర్భావ దినోత్సవం సభ పోస్టర్ ఆవిష్కరణ

శతఘ్ని న్యూస్: పెదనందిపాడు మండలంలోని వరగాని గ్రామంలో జనసేన నాయకుడు దిరిశాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిఠాపురం ఆవిర్భావ దినోత్సవం సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ ప్రతిపాడు నియోజకవర్గం సమన్వయకర్త కోర్రపాటి నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య పాల్గొన్నారు. పెదనందిపాడు మండలంలోని అన్ని గ్రామాల నుండి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు అందరూ కలిసి పాల్గొన్నారని వారు పిలుపు నిచ్చారు. కార్యకర్తలు ఏ విధమైన ఇబ్బందులకు గురి కాకుండా మన నాయకులు ఏర్పాట్లు చేయనున్నారని వారు తెలియజేశారు. గతంలోనే మన అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఈసారి విజయం సాధించి ఆవిర్భావ దినోత్సవ సభను జరుపుకోవాలని అన్నారని, అదే విధంగా కార్యకర్తలు వారి ఆజ్ఞను శిరసావహించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి మన జనసేన పార్టీకి 100% విజయం సాధించడం ద్వారా ఈ సభ చాలా ప్రత్యేకతను చాటుకోటుందని నేతలు తెలిపారు. గత 11 ఆవిర్భావ సభలు పోరాటం చేసి జరుపుకున్నాము. కాని నేడు అధికారం భాగస్వామిగా వుంటూ పిఠాపురం లో జరిగే ఈ సభ కార్యకర్తలకు, నాయకులకు ఉత్సాహాన్ని నింపేదిగా వుంటుందని అన్నారు. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నలుమూలల నుండి ఆధునిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, పార్టీ సానుభూతి పౌరులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోర్రపాటి నాగేశ్వరరావు, ఉప్పు వెంకటరత్తయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగినేని సునీల్ కుమార్, వరగాని గ్రామ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.



శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

గురువారం, 13 మార్చి 2025







శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
గురువారం, 13 మార్చి 2025






# ఆవిర్భావ సభ కోసం లక్ష రూపాయల విరాళమిచ్చిన తిరుపతి అనూష

శతఘ్ని న్యూస్: పిఠాపురం, జనసేన పార్టీ 12 ఆవిర్భావ దినోత్సవ సభ కోసం లక్ష రూపాయలు విరాళామందించిన జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష, జనసేన పార్టీ పిఏసి చైర్మన్ మరియు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి బుధవారం పిఠాపురం దినోత్సవ సభ దగ్గర అందించడం జరిగింది.

# యువత పోరు అట్టర్ ప్లాప్..!

★యువత పోరు ఎవరి కోసం జగన్ రెడ్డి గారు..? ★రాష్ట్రంలో జాడలేని వైసీపీ యువత పోరు

యువత పోరు అట్టర్ ప్లాప్ అంటూ జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత కోసం అని చెప్పుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం పూర్తిగా విఫలమైందని, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేయడానికే ప్రయత్నిస్తోందని ఆమె మండిపడ్డారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, వైసీపీ పాలనలో యువత, విద్యార్థులు, రైతులు, ఉద్యోగార్థులకు ఏమి లాభపడలేదని, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. "బకాయిలు జగన్ రెడ్డి ప్రభుత్వం పెడితే, దానికి బాధ్యత కూటమి ప్రభుత్వంపై వేయాలని చూస్తున్నారు. ఇది ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చేసిన కుట్ర మాత్రమే" అని అనూష విమర్శించారు. ఆమె మాటల్లో, "గతంలో ప్రజలు జగన్‌ను నమ్మి మోసపోయారు, కానీ ఈసారి మళ్లీ మోసపోయే స్థితిలో లేరు. సీఎం పదవిలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమయ్యారు. ఇప్పుడిక ఎమ్మెల్యేగా బెంగళూరు ప్యాలెస్ నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు డైలీ సర్వీస్ చేస్తూ ప్రజలను పూర్తిగా విస్మరించారు" అని ఎద్దేవా చేశారు. యువత కోసం చేపట్టిన పోరాటానికి విద్యార్థులు, యువత నుండి ఎక్కడా స్పందన రాలేదని, ఆందోళన విజయవంతం చేయడానికి వైసీపీ నాయకులు బలవంతంగా కొందరిని రోడ్లపైకి తీసుకురావాల్సి వచ్చిందని చెప్పారు. వైసీపీ నిర్వాకాన్ని అసెంబ్లీలో ఎండగట్టిన లోకేష్: "ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించని వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా యువత పోరు పేరుతో మోసం చేయాలని చూస్తోంది" అని మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ఆరోపించారు. గుడ్లకు రూ.200 కోట్లు, చిక్కీలకు రూ.60 కోట్లు, ఆయా, నైట్ వాచ్‌మెన్ జీతాలకు రూ.65.21 కోట్లు, క్లీనింగ్ మెటీరియల్స్‌కు రూ.22.69 కోట్లు, అడిషనల్ మెనూ కోసం రూ.3.90 కోట్లు, విద్యా దీవెన రూ.2,832 కోట్లు, వసతి దీవెన రూ.989 కోట్లు, పీజీ విద్యార్థులకు రూ.450 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో రూ.788 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందని, ఫీజు రీయింబర్స్‌ను ఎత్తివేసిన జీవో నెంబర్ 77 తెచ్చిన పాపం వైసీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. బలవంతంగా రోడ్లపైకి: విద్యార్థులు, యువత స్పందించకపోవడంతో కొన్ని చోట్ల డబ్బులిచ్చి కొందరిని బలవంతంగా రోడ్లపైకి తీసుకురావాల్సి వచ్చిందని, ఆ వ్యక్తులు కూడా "కూటమి వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేయడంతో వైసీపీ నేతలు అవమానానికి గురయ్యారని తెలిపారు. పైగా, యువత పోరులో అధినేత కానీ, అగ్రనాయకత్వం కానీ పాల్గొనలేదని ఎద్దేవా చేశారు. సోషల్ మీడియాలో కూడా వైసీపీ కార్యక్రమంపై తీవ్రంగా ట్రోల్స్ జరిగాయి. "పింఛన్‌లకు అప్లై చేసుకునే వయసులో ఉన్నవారు యువత పోరు అంటుండడం హాస్యాస్పదం" అంటూ నెటిజన్లు సెటైర్లు వేశారు. తిరుపతి అనూష వ్యాఖ్యలు: జనసేన పార్టీ యువత భవిష్యత్తును మెరుగుపరిచే విధంగా కృషి చేస్తుందని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉందని ఆమె తెలిపారు. వైసీపీ పాలనలో యువత భవిష్యత్తును నాశనం చేశారని, ఈసారి ప్రజలు మోసపోవడం అనుమానమేనని తేల్చిచెప్పారు.



# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

గురువారం, 13 మార్చి 2025





